క్లుప్తంగా

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



దొడ్డనపూడి గ్రామంలో వైద్య శిబిరంలో ప్రారంభిస్తున్న దృశ్యం

కాళ్ల: పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ జహర్ హుస్సేన్ తెలిపారు. పశు గణాభివృద్ధి పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సూడు కట్టని పశువులపై పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు వర్షాకాలంలో పాడి రైతులు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారావు, కాళ్ల ఆకివీడు మండలం పశువైద్యాధికారులు చంద్రబాబు, కె.జనార్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం



ధూమపానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌హెచ్ఎం లీగల్ సెల్ ఆఫీసర్ పుట్టి శివ శంకర్, హైకోర్టు న్యాయవాది ప్రదీప్ హెచ్చరించారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల సంక్రమించే క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పొగాకు విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వ్యక్తులకు, విక్రయించే దుకాణ యజమానులకు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, టుటౌన్ ఎస్సై సీహెచ్ రమేష్, పి.సురేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ, పోలీసు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక చట్టాలతో భరోసా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి

ఆకివీడు: మహిళల భద్రత కోసం మహిళా చట్టాలు భరోసాగా నిలుస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి చెప్పారు. మండలంలోని పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు గ్రామాల్లో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ మహిళలు స్వీయరక్షణతో పాటు చట్టాలు గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కూడా చట్టాలపై అవగాహన కల్పించారు.

క్రీడలతో బంగారు భవిష్యత్



క్రీడాసామగ్రి అందిస్తున్న దృశ్యం

ఉండి: క్రీడలను ఉపాధిగా ఎంచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని కోలమూరు కెనరా బ్యాంక్ మేనేజర్ జగదీష్ అన్నారు. మంగళవారం పాములపర్రు ప్రాథమిక పాఠశాలలో బ్యాంకు వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని క్రికెట్, వాలీబాల్, స్కిపింగ్ రోప్స్, రింగ్స్ వంటి ఎనిమిది రకాలైన క్రీడాసామగ్రిని విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నక్కా చెన్నకేశవరావు మాట్లాడుతూ దేశంలో క్రీడాకారులకు ఉన్నతమైన హోదా లభిస్తుందని దానిని గుర్తించి ప్రతీ తల్లితండ్రీ విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని అన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

పాలకోడేరు: గత వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా నీట మునిగిన ముంపు ప్రాంతాలను సీపీఎం బృందం పరిశీలించింది. మంగలశారం మండలంలోని మోగల్లు గ్రామంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జేవీఎస్ గోపాలన్, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, మండలకమిటీ సభ్యులు పాలా వెంకటస్వాములు పర్యటించారు. మోగల్లులో గోస్తనీ డ్రెయిన్‌కు గండిపడిపోవడం వల్ల ఇరువైపులా ఆనుకుని ఉన్న సుమారు 300 ఎకరం పంట భూమి నీటమునిగిందని, అధికారులు తక్షణం స్పందించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం బృందం డిమాండ్ చేసింది.

ఉత్సాహంగా శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

కాళ్ల: బోధనాభ్యసన ప్రక్రియలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ముఖ్య భూమిక పోషిస్తుందని ప్రాంతీయ ఉపసంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారిణి జి.నాగమణి అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలిలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళా, ఎఫ్ ఎల్ ఎన్ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జి.నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ అంకితభవంతో పనిచేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు చోటు ఉండదని స్పష్టం చేశారు. సమగ్ర శిక్ష ఎడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి. శ్యాంసుందర్ మాట్లాడుతూ ఇంత చక్కని కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. లో కాస్ట్ నో కాస్ట్ టీఎల్ఎం పిల్లలకు అర్థవంతంగా బోధించడానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనాభ్యసన సామాగ్రిని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో బీఆర్ఎంకే స్వామి, జీబీ ప్రశాంతి, జి.సుబ్బారావు, డి.కనకదుర్గ, టీఎల్‌కలికి మూర్తి, బాలాజీ సుబ్రహ్మణ్యం తయారు చేసిన టీఎల్ఎంను అధికారులు అందరూ ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఏవీ సుబ్బరాజు, ఎస్.విజయలక్ష్మి, కె.వెంకట్రావు, పి.పాపారావు తదితరలు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద మొక్క నాటుతున్న దృశ్యం



శిక్ష సప్తాహ్ ముంగింపు సందర్భంగా మాట్లాడుతున్న హెచ్ఎం విక్రమ్

ఆకివీడులో..

ఆకివీడు: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు డాక్టర్ కృష్ణ స్వామి, కసూరి రంగన్ సిఫార్సుల మేరకు అమలుజేస్తున్న విద్యా విధానానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆర్వీ. నారాయణ(విక్రమ్) చెప్పారు. మండలంలోని అజ్జమూరు గరువు ఎంపీపీ పాఠశాలలో మంగళవారం కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించారు. వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

26న ఉండిలో జాబ్‌మేళా

ఉండి: ఉండి దివ్య కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ కే దుర్గారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే ఈ జాబ్‌మేళాకు ఇండిగో, డిగ్నాన్, ఐటీఐసీఐ బ్యాంక్(ఎన్ఐఐటీ),అరబిందో,అపోలో ఫార్మసీ,ఐసూజ్, స్పందన, హోదాయ్,రాక్‌మెన్ వంటి ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులుఈ జాబ్‌మేళాకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కంపెనీలలో మొత్తం 870 ఖాళీలు ఉన్నాయని తెలిపారు.ఈ జాబ్‌మేళాకు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బి-టెక్, ఫార్మసీ, ఐటీఐ అర్హత కలిగిన వారు తమ సర్టిఫికెట్స్‌తో ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి జీతం నెలకు రూ.12 వేల నుండి రూ.25 వేల వరకు వుంటుందని ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఏ కళాశాలకు చెందిన విద్యార్థులైనా ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 99083 57835నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత

కాళ్ల: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని పిల్లలు వాటిని ఉపయోగించుకుని మంచి పౌరులుగా ఎదగాలని టీడీపీ నాయకుడు చెల్లబోయిన శ్రీనివాస్ అన్నారు. కాళ్ల మండలం లక్ష్మీనరసింహపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాత వీరవల్లి రమేష్ ఆర్థిక సాయంతో విద్యాసామగ్రిని మంగళవాకరం పంపిణీ చేశారు. వీరవల్లి రమేష్ తల్లిదండ్రులు వీరవల్లి భాస్కర రావు(బాబీ), వీరలక్ష్మి జ్ఞాపకార్థం పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్, కాపీపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు మొదలైన విద్యాసామగ్రిని అందించారు. కార్యక్రమంలోజుత్తుగ శ్రీనివాస్, యిర్రింకి బుజ్జి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భీమవరం: జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి ఈనెల 10వ తేదీ లోపుగా జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి, గాంధీ కస్తూరిభా భవనం, శ్రీరాంపురం, భీమవరం -2, పశ్చిమగోదావరి జిల్లా అనే చిరునామాకు పోస్టు ద్వారా పంపాలని పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు స్కూల్ ప్రధానోపాధ్యాయుని ధ్రువీకరణ పత్రంతో పంపించాలని, ఉత్తమ రచనలకు బహుమతులు అందిస్తామని ప్రసాదరాజు తెలిపారు.

దళితవాడల్లో రోడ్లపైనే మురుగునీరు

పాలకోడేరు: ఏళ్లు గడుస్తున్నా మా బతుకుల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదని శృంగవృక్షం కోరుకొల్లు, మోగల్లు పాలకోడేరు గ్రామాల్లోని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చిందంటే చాలు మోకాలు లోతు నీటి లోంచి నడవాల్సిందేనని వాపోతున్నారు. ఈ సమస్య ఒకటి రెండు రోజులు కాదని, వర్షాకాలంలోని నాలుగు నెలలూ ఎదుర్కోవాల్సి వస్తుందని బాధ పడుతున్నారు. డ్రెయినేజీలు, ఔట్‌లెట్‌లు లేకపోవడం మా పాలిట శాపంగా మారిందని పేర్కొంటున్నారు. ఎంత మంది పంచాయతీ పాలకులు మారినా మా బతుకులు మారడం లేదని, రోగాలతో ఎన్నాళ్లు ఇబ్బంది పడాలని ప్రశ్నిస్తున్నారు. కోరుకొల్లు దళితవాడలో, పాలకోడేరు గరువు కొత్తపేటలో, శృంగవృక్షం చినపేటలో, మోగల్లు దళితవాడలో ఈ సమస్యతో బాధపడుతున్నారు.



కోరుకొల్లులో రోడ్డుపై నిలిచి ఉన్న బురద నీటిలోంచి వెళ్తున్న ప్రజలు



శృంగవృక్షం లోని చిన్న పేట లోని దుస్థితి

పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు

కాళ్ల: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలో నీరు నిలువ లేకుండా, దోమల ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పెదఅమీరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. గ్రామంలో మంగళవారం బ్లీచింగ్ చల్లి నీరు ఎక్కడ నిలవ లేకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామంలో వీధి వీధిలో బ్లీచింగ్ చల్లి నీరు నిల్వ ఉన్నచోట నీటిని మళ్లించి దోమలు వృద్ధి చెందకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గ్రామ ప్రజలంతా ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీరు నిలువలేకుండా చూసుకోవాలని తెలియజేశారు. నెహ్రూ పేట నుంచి వెళ్లే మురుగు కాలువ పొంగటంతో నీరు వెళ్లే మార్గం లేక పంట పొలాలు ముంపునకు గురి అవుతున్నాయని రైతులు తెలపడంతో పొక్లెయిన్ ఏర్పాటు చేసి మురుగుకాలువ అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.



మురుగు కాలవ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ సోమయ్య

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

భీమవరం: భీమవరం బార్ అసోసియేషన్ అభివృద్ధికి, న్యాయవాదుల సంక్షేమానికి పాటుపడతామని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ అన్నారు. స్థానిక మూడో అదనపు జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన మాట్లాడారు. అధ్యక్షుడిగా న్యూటన్, ప్రధాన కార్యదర్శిగా అడపాల ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడిగా కె.వెంకట్రావు, జాయింట్ సెక్రటరీగా జవ్వాది సత్యనారాయణ, లైబ్రేరి సెక్రటరీగా కందికట్ల నాగరాజు, కోశాధికారిగా పరాల రావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా హరి, లేడీ రిప్రజెంటేటివ్‌గా భాగ్యలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా గూడూరి వెంకటేశ్వరరావు, మద్దాల హరిచంద్రుడు, బోడిగడ్డ సునీల్, సౌజన్య, మట్టా చంద్రశేఖరబాబు, వంశీ, శ్యామల ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదుల అభినందించారు.



ప్రమాణస్వీకారం చేసిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బాల్య వివాహాల వల్ల దుష్పరిణామాలు

వీరవాసరం: మహిళల పురోభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రత్యేక కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీకే లక్ష్మీకాంతం తెలిపారు. వీరవాసరం మండలం మత్స్యపురి జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకొని, వాటిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మహిళలు బాలికలపై జరిగే మహిళ వేధింపులకు ప్రతిఒక్కరూ తక్షణం స్పందించి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలకు బ్యాడ్‌టచ్ గుడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎం .సూర్యప్రభ సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీకాంతం

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

భీమవరం అర్బన్: వర్షాల నేపథ్యంలో కూలి పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు ఎం ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం మండలం కె.బేతపూడి, నడిపల్లి, యమునాపల్లి మంగళవారం ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని ఉపాధి కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ బకాయిలు తక్షణమే చెల్లించాలని లేకుంటే గ్రామాల్లో పంచాయతీల వద్ద ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుంగా కటాక్షరావు, మంగం పండు, కుచ్చినపల్లి ఏసురత్నం, చిలకపాటి మార్తా, నేతల జేమ్స్ రాజ్, రజిని ప్రశాంతి, బుంగా రాజమణి తదితరులు పాల్గొన్నారు.



యమునాపల్లిలో నిరసన తెలుపుతున్న కూలీలు, నాయకులు

రహదారి మరమ్మతుల ప్రారంభం

కాళ్ల: మండలంలోని కోమటి గుంట గ్రామ పరిధిలో అధ్వానంగా ఉన్న రహదారిని ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు సర్పంచ్ బోనం భాగ్యశ్రీ శివకుమార్ తెలిపారు. స్థానికంగా ఉన్న రహదారి మరమ్మతు పనులను మంగళవారం చేపట్టారు. ప్రధాన రహదారిలో రోడ్డు కుంగిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని ఆమె తెలిపారు. జేసీబీ సహాయంతో రోడ్డును శుభ్రపరచి ప్రయాణానికి అణువుగా ఉండే విధంగా పనులు చేపట్టారు. గ్రామం మాజీ సర్పంచ్ ఎరుబండి రామాంజనేయులు, బోనం శివకుమార్ తదితరులు పనులు పర్యవేక్షించారు.



రహదారిపై చంట్రు సర్దుతున్న దృశ్యం

చేలల్లో ముంపునీటిని తొలగించాలి



గునుపూడిలో వరినాట్లను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్



ఉండిలో ముంపులో ఉన్న వరి నారుమడి

భీమవరం అర్బన్: వరి నాట్లేసిన పొలంలో వరద నీటిని వెంటనే తొలగించాలని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. గునుపూడిలో వరినాట్లను మంగళవారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనాలు చేశారు. చేలల్లో వరదనీటిని బయటకు మళ్లించి, ఎకరానికి 20 కిలోలు యూరియా, 10 కిలోలు పోటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని అన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో వరి ఆకుపై 2 శాతం యూరియా లేదా పోటాషియం నైట్రేట్ పిచికారీ చేస్తే వరి పైరు త్వరగా పుంజుకుంటుందని చెప్పారు. మాగుడు తెగులు ఇతర కుళ్లు తెగులు సోకకుండా కార్బన్‌డిజం 1 గ్రాము, మాంకోజేబ్ మిశ్రమ మందు 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ వరి నారుమడులలో వరదనీటిని తొలగించాలన్నారు. కార్బన్‌డిజం 1.5 గ్రాము మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నారిమడుల గట్లను ఎత్తుగా వేసుకుని వరదనీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడీఏ శ్రీనివాస్ వెంట ఎంపీఈఓ అజయ్, కమ్మ బాలమురళీ, బొబ్బిలి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ముంపులోనే వరి చేలు

ఉండి: వర్షం రాలేదు కానీ ఉండి పంటకాలువ,యనమదుర్రు డ్రెయిన్ మరో పక్క బొండాడ మేజర్ డ్రెయిన్ మాత్రం ఉగ్రరూపం తగ్గలేదు. మంగళవారం ఒకదానిమించి మరొకటి ప్రవహిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. యండగండి, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా ఉంటున్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో కాలువగట్లు బలహీనంగా ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ రెండు మేజర్ డ్రెయిన్‌లు,ఉండి పంటకాలువలో ప్రవాహం వేగంగా ఉండడం, ఎక్కడా నీరు తగ్గకపోవడంతో మరోరోజు వరి పొలాలు, నారుమడులు నీటిలోనే మగ్గుతున్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో నారుమడులు కుళ్లిపోతున్నాయని, నాట్లు వేసిన వరిచేలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద నీటిలో రామలింగేశ్వరస్వామి ఆలయం





నత్తారామేశ్వరంలో వరదనీటిలో శ్రీనత్తారామలింగేశ్వరస్వామి ఆలయం, వరదనీటిలో పూజలు చేస్తున్న అర్చకుడు →

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయం గోస్తనీ జలదిగ్బంధంలో ఉంది. నిన్నటి వరకు ఆలయ మండపంలోకి ప్రవేశించిన వరదనీరు మంగళవారం నుంచి గోపురం మెట్లను కూడా తాకుతుంది. గోస్తనీ గర్భంలో ఉన్న పరశురామ ప్రతిష్ఠ రామలింగేశ్వర ఆలయం పూర్తిగా శిఖరం వరకు వరద నీటిలో మునిగి ఉండగా సీతారామ ప్రతిష్ఠ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కూడా మోకాలు లోతు నీరు ప్రవహించింది. దీంతో శ్రీరామలింగేశ్వరునికి ఉమాదేవికి నీటిలోనే నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. నీటిలోకి దిగి వెళ్లి కొందరు భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్నారు. గోస్తనీలో రోజురోజుకూ వరద ఉధృతి పెరగడంతో వారం రోజులు వరకు ఈ ప్రాంతంలో వరదముంపు తగ్గే పరిస్థితి కానరావడంలేదు.

మోటారు సైకిల్ చోరీపై కేసు

పాలకోడేరు: తన ఇంటి ముందు పెట్టిన మోటారు సైకిల్ చోరీకి గురైందని కొరుకొల్లుకు చెందిన షేక్ బాబాజీ మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఈ నెల 13న గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

తిలక్, ఆజాద్‌లకు నివాళి



తిలక్, ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: స్వాతంత్ర్యోద్యమ వీరులను స్మరించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకమని స్థానిక సబ్ ట్రెజరీ అధికారి అల్లూరి రవివర్మ అన్నారు. మంగళవారం విజ్ఞాన వేదిక సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త బాలగంగాధర తిలక్, విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్మృతివనం వద్ద తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లకు నివాళులర్పించారు. తిలక్, ఆజాద్‌ల చిత్రపటాలకు అల్లూరి రవివర్మ, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాతల జేమ్స్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, అరసవల్లి మణికంఠ వెంకటేష్, ఎస్కే చాన్ బాషా, ఆర్ఎస్ సూర్యనారాయణ, ఎస్ వెంకటేశ్వరరావు, ఎస్ వెంకట్రావు, డీకేవీ.ప్రకాష్, జీకే రాజు తదితరులు పాల్గొన్నారు.